# రచ్చబండ

పెద్దయ్యా! యియాలన నాకు తీరుపునియ్యాల్సిందే. నిన్న సాచ్చీకం విన్నావుగా. అన్నాడు రామదాసు.

కూచోండి, కూచోండి అందరూ. నించున్నారెందుకు? నేనూ మీలో ఒకడినే. మీరంతా నా మాట మీద గౌరవముంచి వూరిపెద్దను చేస్తే పెద్దయ్యనయాను. పెద్దయ్య చేతులాడిస్తూ కూచోమని, తానూ రావిచెట్టు కింద రచ్చబండ మీద కూచున్నాడు. అయనీడు వాళ్ళే మరో నలుగురు ఆయనకిరువేపులా కూచున్నారు. పొద్దుటిపూట లేత యెండ, అందరికీ వెచ్చదనమిస్తున్నది. గాలికి రావాకులు గలగలమంటున్నాయి.

నేత ధోవతీ పట్టంచులది. తెల్లని ఖద్దరు షర్టు యిస్త్రీది. తెల్లని జరీ తలపాగా, పొన్ను వున్న చేపాటి కర్ర. కిర్రు చెప్పులు, చేతులకి దండవ వద్ద వెండి కడియాలు, ముంజేతులకి బంగారు మురుగులు, నెరిసిన మీసాలూ, మనిషి స్ఫురద్రూపి పెద్దయ్య. వయస్సు యెనభై. అయినా దృఢంగా ఆరోగ్యంగా వుంటాడు. నాలుగోతరం చూశాడు. ఓడలు బండ్లు కావటం, బండ్లు ఓడలు కావటం చూశాడు. ఆయన మతం అచలమతం. అచలమతం షణ్మతాలకి ముందే వ్యాప్తిలో వున్నది. దానిలోనించే అన్ని మతాలూ, ఒకదాని తరవాత ఒకటి పుట్టి పెరిగాయి. రాజాదరణ పొందినప్పుడు వరద లొచ్చిన నదిలాగా పొంగి పొరలేవి. రాజాదరణ లేకపోగానే గ్రీష్మంలో జీవనదిలాగా సన్నగిల్లిపోయి ప్రజలలో ప్రవహిస్తు వుండేవి. పెద్దయ్య రాజకీయాలనూ, మతాలనూ పోలుస్తూ హాస్యమాడతాడు. "అర్ యస్ యస్ లోంచి పుట్టిందే బిజెపీ

బిజెపీ కూతురే శివసేనా. అంటే ఆర్ యస్ యస్ మనమరా అన్న మాట శివసేనా పోలికలెక్కడికి పోతాయి నాయన లారా?" అలా హాస్యమాడతాడు.

"అసలు తగవు యెందుకొస్తుంది? మీలో మీరే సర్దుకో లేరూ? మీ పెద్దలు సర్ది చెప్పలేరా? వాళ్ళను మీరు గౌరవించరా? తల పూరికే పండుతుందా? అనుభవం మీద జ్ఞానం రాదా? రచ్చకెక్కటం అవమానంగా తోచదా? నలుగురెదుటా ఒకర్నొ కరు తప్పులెన్నుతారా? యేళ్ళు నెత్తినెక్కిన కొద్దీ మతులు పోతాయా? దేనికి పెద్దవాళ్ళవుతున్నారూ? జీవితమొక సన్న జాజి చిన్ని మొగ్గ గదరా! దినదినము జ్ఞానమనెడి తెలి రేకుల వెలుగు. అని పాడతాడు పెద్దయ్య.

అచలమతం లోంచే సనాతన పుట్టింది జ్ఞానులభివృద్ధి జెందిపంచభూతాలు దేముళ్ళు గారు. ఈ పంచభూతాలకన్న అతీతమైన శక్తి యేదో వున్నది అని ఆలోచిస్తూ తమకు అర్థ మైన రీతిలో ఋగ్వేదం వెలిసింది. విద్ అనే ధాతువు నుండి వేదం అనే పదం పుట్టింది. బాగా అర్థం చేసుకునే గానం చేశారు గనక వేదములు అన్నారు. అప్పుడు వ్యాప్తిలో కొచ్చింది వైదిక మతం. అప్పుడు గూడా రాగద్వేషాలు తక్కువే. వర్ణాలు తక్కువే, సామూహికంగానే అన్నీ చేసుకునే వారు. శివి లేదా శిబి అనే లీడరు యజ్ఞం చేస్తుండగా పావురం వచ్చి ఒడిలో వాలింది. దాన్ని కాపాడాడు. దాని వెంటే డేగ వచ్చింది. అది నా ఆహారం యిచ్చేయి. అన్నది డేగ. విధులు కలిసే చేసేవారు. ఒక తెగ చేయాలని నియమం లేద ప్పుడు. ఇంకా మేధస్సు వికసించి, జ్ఞానం పన్నగిల్లుతూ,

శైవం, వైష్ణవం, కాపాలికం, శాక్తేయం, గాణాపత్యం, ద్వైతం, అద్వైతం, బౌద్ధం, జైనం, వీరశైవం, వీరవైష్ణవం, అలా కొమ్మలూ రెమ్మలు పెరిగి, మతమనేది మహా వృక్షంగా అయింది.

పెద్దయ్య మనసునిండా ప్రేమా, దయా, శాంతమూ నిండి వుంటాయి. ఆయన చూపే తండ్రి చూపు. దయతో నవ్వుతాడు.

యెందుకు రామదాసూ అంత వేగిరపాటు? పరిస్థితులవే చక్కబడతాయి అనుకోలేవూ. వున్నదానితో తృప్తిగా వుండలేవూ? రానిది రాదు సురాసురులకైనా / పోనిది పోదూ భూసురులకైనా అన్నాడు నాదబ్రహ్మ. వూరడింపుగా చూశాడు పెద్దయ్య.

యెలాగా వూరుకోను పెద్దయ్యా! పిసరంత కాదు గందా మేలిమి బంగారం, నిశ్చయం చేసిననాడు కులపెద్దలెదుటే పెట్టినాము. కోడలికి ధనుర్వాత మొచ్చి పురుట్లోనే పోయె. తడ్రీమీ కూసింత గూడా పెట్టనేదు పైడి. సారే యివ్వలేదు. వుడకేసి పెడుతున్నది. బుద్ధిమంతురాలని సంతసించి రచ్చబండకాడికి రాకపోతిని. ఇప్పుడేమైనాదీ? బిడ్డనూ మేమే సాకాలట. ఆడ సూసేవోరు లేరంట. ఆడదిక్కు పోయె. యియ్యంకుడేమో మారు మనువాడె. బంగారంమంటి కోడలూ పోయె. మేము పెట్టిన దిచ్చేయి అది నాయం అది కట్టుబాటు అంటే యియ్యంకుడు ససేమిరా అంటున్నాడు. అట్ల అనిపిస్తున్నది ఆడి పెల్లామే. సవిత నగలూ కావాలంట, కూతురూ నగలూ

కవాలంట. నాయం బాగుందా. పెద్దవాళ్ళచేత చెప్పిస్తే 'కానుపు కాకపోతే ఆస్పాటల్లో చేర్పిస్తిని. ఆడే పోయినాయి. ఆళ్ళే కొట్టేసినారు. చేర్పించినప్పుడు నగలు ఒంటిమీదున్నాయి. సాచ్చులున్నారు' అంటున్నది వియ్యపురాలు. ఈ నాయం బాగుందా? యేమని తీర్పు సెపుతావో వినాలి. కళ్ళూ మొహం అద్దుకున్నాడు రామదాసు.

యెంత బంగారం పెట్టినావూ రామదాసూ?

నా అలిపీ కొత్తవీ కలిపితే ముప్పై తులాల బంగార మెట్టితిని.

బంగారమంటి మనమడిని కని యిచ్చి పోయింది గదా కోడలు. వాడప్పుడే నేమీద దెగబడుతూ 'తాత తాత' అంటు న్నాడు. యెవ్వరి దగ్గరకీ పోడట. యేమో రేపు ప్రయోజ కుడై నీ ముప్పై తులాల బంగారం సంపాయించి నీకిస్తా డేమో. బంగారమంటి మాగాని భూమి వుండెగా రామదాసూ. కలిసొచ్చే రోజొస్తే."

రామదాసు లేచి నిలబడి తలపాగా సద్దుకున్నాడు.

పెద్దయ్యా! నీవిపాళ మెట్టవేదాంతం సెపుతున్నావు. నీ బొమ్మ సవు కోల్పోతే గాని నీకు తెలిసిరాదు. అదుగో వియ్యాపు రాలు కాసులదండేసుకొచ్చింది. ఆమె పక్షం సెపుతావేమో.

"లేదు రామదాసూ! పోవోకు. యేమమ్మా! సత్తెమ్మా. కట్టుబాటు దాటుతావా? నష్టపోతావా? నష్టమంటే రెట్టింపు నష్ట పోతావు. రామదాసూ! మనసు కష్టపెట్టకోకు, నేమ ఆమాట

వించే, నీ వియ్యపురాలికి మంచి చెప్పాను. యెన్నేళ్ళ ప్రపంచం చూశాను. ఈ వెంట్రుకలూరికెనే తెల్లపడ్డాయా? రామదాసూ! ఇంద. నా మురుగులు ముప్ఫయి తులాలు. నేను చెప్పిన తీర్పుకి మెచ్చి పెద్దబాబు యిచ్చినాడు. ఇవి తీసికెళ్ళి వాడుకో. రొష్టు పడకు. నీ సొమ్ము నీకు తప్పక తిరిగివస్తుంది. నే చెపుతున్నాగా. నా మీద నమ్మకముంచు. నీ సొమ్ము నీ కందగానే, నా సొమ్ము నాకిచ్చేద్దువు గాని, దైవం మీద నమ్మకముంచాలి. ఈనాటికింత ప్రాప్తముచ్చింది అనుకోవాలి."

"పెద్దయ్య పదికాలాలపాటు బాగుండాలి. తీర్పు బాగుండాలి." అందరూ చేయెత్తి అరిచారు. సత్తెమ్మ తలొంచుకుని వెళ్ళిపోయింది. రామదాసు లేచి అన్నాడు.

"పెద్దయ్యా! నా సొమ్ము నాకు రాగానే, తప్పక నీ మురుగులిచ్చేస్తా. పెద్దలెదుట సత్తెప్రమాణకంగా చెపుతున్నాను. నేనా మురుగుల్ని అమ్మను."

"అలాగే. అలాగే. రామదాసూ. నా తీర్పుమీద నీ కెప్పుడు గురి కుదిరిందో, అప్పుడే నీ సొమ్ము నీకందబోతున్నదన్న మాట."

పెద్దయ్య నవ్వుతూ అన్నాడు. రామదాసు వెళ్ళిపోయాడు.

సీతమ్మ లేచి నిలబడింది. "పెద్దయ్యా! నాకూ తీర్పు కావాలి. నా సంగతిక్కడున్న చాలా మందికి తెలుసు. నువ్వూ వినే వుంటావు." అందరి వంకా చూసింది. అందరూ తల లూపారు.

"విన్నాను సీతమ్మా! యే విషయంలో తీర్పు కావాలి. వచ్చిన యిబ్బందేమిటి? నోరు మంచిదయితే వూరు మంచిదవుతుందని నమ్మి పెట్టుకొస్తున్నానని చూస్తూనే వున్నా, నాదాకా రావాల్సి వచ్చిందే? అన్నా డూరడింపుగా.

"నన్నొక్కత్తెనూ వాళ్ళ యింటికి వెళ్ళమంటున్నాడు రావుఁలు. ఇంతవరకయింది చాలక మళ్ళా యేదో దుశ్చింత చేస్తున్నాడు. యేనాడు సంఘ కట్టుబాట్లు లేవో నాకు, ఆనాడే వెలి అయినాను. ఇప్పుడెందుకెళ్ళాలి. వెళ్ళి యేమిటి బావుకుంటాను. ఒకనాడు పట్టిన తప్పు అట్లాగే వున్నది పెద్దయ్యా. ఓనాడు యెంత మొత్తుకున్నా కట్టుకోలేదు నన్ను." అంటూనే కళ్ళు తుడుచుకున్నది సీతమ్మ.

"యేం రావుఁలూ? రచ్చకెక్కచ్చా యిటువంటి విషయాలూ. మొదటే నీకీ ఆలోచనెందుకు రాలేదు? చెప్పినా యెందుకు వినిపించుకోలేదూ? ఆనాడే రచ్చబండకు రాక పోయావా? మగబిడ్డవు గదూ?" పెద్దయ్య మందలింపుగా అన్నాడు.

"మగబిడ్డనే పెద్దయ్యా! సంతానం కలిగిందిగా" అని నవ్వాడు. "నేనేం చేయనూ పెద్దయ్యా. పెళ్ళి చేసుకుంటాను" అంటుండగానే మా అమ్మ భావి బొడ్డుమీద కెక్కింది. మాది గాడి బావి. మా అయ్యేమో చేపాటి కఱ్ఱ తీసుకుని కొట్టటాని కొచ్చాడు. అక్కడికీ దెబ్బలకి సిద్ధపడి 'యేమిటి అడ్డంకి?' అనడిగితే 'దాని తాత హంతకుడు, మన వూరివాడని దయ తలచి వూరి గౌరవం కాపాడాలని, నలుగుర్నీ కూడ గట్టుకుని,

పోలీసుల్ని చేయి తడిపి మంచి చేసుకుని, రచ్చా రాద్ధాంత, లేకుండా చేసి మనిషిని కాపాడి, గప్‌చుప్‌గా వుండిపోతే యిదా నీ నిర్వాకం. యెప్పుడూ వాళ్ళని కాపాడటమేనా నా పని. నాకున్న పరపతి వీళ్ళకోసమా వాడేది. నువ్వు దాన్ని కట్టు కునేందుకు వీల్లేదు. అదీ తాతలాంటిదే గం[డ్రా]గొండిది.' అని అరిచాడు.

'తాతలాంటిది కాకపోవచ్చుగా అయ్యా!' అంటే మీది కొచ్చాడు పారిపోయినా. మళ్ళా నవ్వాడు రావుఁలు.

"అటువంటప్పుడు వాళ్ళకే లోబడి వుండకపోయా?" అనడిగాడు పెద్దయ్య." వాళ్ళు చెప్పినట్టే వినచ్చుగా."

"యెట్టా! పెద్దయ్యా! ఆనాటికి సీత మాంచి అరమొగ్గిన బంగనపల్లి మామిడిపండల్లే వుండె. గుమ్మటమల్లే వుండె. ఒళ్ళు దాచుకోకుండా పని చేస్తుండే. భలే రంగ ఆడదానికి కొప్పే అందం అని తలను మించిన కొప్పైపాయె. చావనా. పిలిస్తే తలెత్తి నవ్వేది. చావనా పెద్దయ్యా!"

పెద్దయ్య మొహం మీద నవ్వు పాకింది. అక్కడున్న వాళ్ళూ ఆనందించారు.

"మొగుణ్ణి రచ్చకీడ్చావేం సీతమ్మా! తప్పు గాదూ." అన్నాడు పెద్దయ్య?

తల్లిని కాబోతున్నానంటే పెద్దయ్యా! మొగుడెవరైందీ చెప్పద్దన్నాడు. ఇవాళ మొగుడెట్లా అయినాడూ. దొంగ లాగానే వచ్చేవాడు. దొంగలాగానే వెళ్ళేవాడు. వీడి మూల

కంగా పాడు మాటలన్నీ పడ్డాను. నన్నంతా అసహ్యించు కున్నారు." మళ్ళా కళ్ళు తుడుచుకున్నది సీతమ్మ.

"యెందుకలా అన్నావు? రావుఁలూ"

"చెప్పాగా పెద్దయ్యా! మా అమ్మ భావిలో దూకుతుంది. మా అయ్య కర్రతో నన్ను చంపేస్తాడు. రెండు హత్యలు అవా లని చెప్పానలా?"

రావుఁలు నవ్వుతూనే అన్నాడు. అందరూ నవ్వారు.

"వెళ్ళటం మానకపోయినా? యెదురెందుకు తిరిగావు?"

"కట్టుకోవద్దన్నారు గాని, పోవద్దనలేదు గదా అని పోయినా" అంతా చప్పట్లు కొట్టి నవ్వారు. "రామలింగనిలాగా అలోచించాడు రావుఁలు. రాయలు మొహం చూపించద్దన్నాడు గాని తక్కినది కనపడచ్చుగా అని సెత్తిని సున్నపు కుండకు కన్నాలు పెట్టి బోర్లించుకుని వెళ్ళాడు. రాములూ అలాగే అలో చించాడు." మళ్ళా నవ్వారు.

"అయినా తెలిసిపోతుందే రావుఁలూ? నిజం దాగు తుందా?"

"దాగలేదు. మా అమ్మ గొంతు పెద్దదైంది. 'పురుడు పోయమని వస్తుందేమో' అని రకరకాల భయాలు వెల్లడిం చింది.' అదే పోసుకుంటుంది. వాళ్ళ వాళ్ళే చూస్తారు. నీ యింటి కెట్లా వస్తుంది. నువ్వు నిక్కు కట్టలేదు గదా?' అని ధైర్యం చెప్పాక అన్నం దిన్నది. లేకపోతే ఆనాడల్లా అంద రికీ వస్తే" రావులు కదిలిపోతూ నవ్వాడు. ఘనకార్యం చేసి నట్టు నవ్వాడు.

మరి యివాళెందుకు వెళ్ళమంటున్నావు?" పెద్దయ్య సం శయం వెల్లడించాడు.

"నే చెప్తా పెద్దయ్యా. నలుగురూ వాళ్ళమ్మను నిగ్గదీస్తు న్నారుట. 'యేం చేశావే కోడల్నీ, యెందుకు నీ యింటికి రాదూ? మంచాన బడితివీ? చూసి పోక్కర్లా?' అంటుంటే వాళ్ళ మ్మకి తల కొట్టేసినట్టయిందిట. నే వెళ్ళి 'నన్నేమీ చేయలేదు' అని ఆవిడ గౌరవం నిలబెట్టాలిట పెద్దయ్యా."

'పోనీ వెళ్ళమన్నాడను కొందాము సీతమ్మా వెళ్ళనన టానికి కారణాలు వినాలి తీర్పు కావాలంటే.

'మొదట కారణం తెలిసిందిగా పెద్దయ్య. తక్కువ కారణా లు, అంతకంటే చిన్నవేమీ కాదు. తానేమో మాఅమ్మని తప్పు లెన్నుతూ గేలి చేస్తాడుట. మా అమ్మ దగుల్బాజీ, పోర్జరీ చేసి నది. బ్లాక్ మెయిలర్ డబ్బు మనిషి యెక్కువ వడ్డీలకి అప్పులి చ్చి, పేదవార్ని దోచేస్తున్నది. యెక్కడ యేది దొరికితే అది తింటూ కనబడుతుంది. ఆలా బాగానొప్పి కలిగేటట్టు యెదురుగా నిలబడి అంటుంటే నొచ్చుకోకండా నవ్వాలిట. అంతటితో అయి పోలేదు. తన తల్లిని, తండ్రినీ దేవలతలని వెన్నవంటి మనసనీ తెలియ జెప్పాడు. అప్పుడు నువ్వు సంఘ విరుద్ధమైన పని చేశా వని రావద్దన్నారు గాని యిప్పుడేమనరు, మంచి పేరు ప్రఖ్యాతి తెచ్చుకొని ఎలక్షన్స్‌లో నిలబడుతున్నావు గదూ గౌరవంగానే చూస్తారు" అన్నాడు. నిజమేనని నమ్మి వెళ్తే యీ కొడుకు కను మరుగ్గాంగానే వాళ్ళమ్మయీూసడించికొట్టి గేలిచేసింది పెద్దయ్యా బంధువులెదుటే నీకు సంఘభీతి లేదుగా సంఘం నెదిరించ గలవు

మీ అమ్మకి వడ్డీవ్యాపార రహస్యాలు తెలుసు యెన్నికలలో నిల బెడితే నల్ల ధనంతో గెలుస్తావు. బాపుందా పెద్దయ్యా! చేతిపైతే తామూ ఆ వ్యాపారం చెయ్యొచ్చుగా సంతకమె రాదు. దుయ్యి బట్టమంటే ముందుకొస్తుంది. నాకూ న్యాయం కావాలి. యేమని తీర్పు చెపుతావు వినాలి. అందరూ రావులు వంక చూశారు.

"అదంతా హాస్యం పెద్దయ్యా! మా అమ్మకి కోడలు సీత అంటే చాలా గౌరవం. దాని పిల్లలు రత్నాలంటి వాళ్లు, బుద్ధిమంతులని పొగుడుతుంది. మా అయ్య తానే వచ్చి అత్తింటికి తీసి కెళ్తానన్నాడు. ఇదీలోపునే రచ్చబండ కొచ్చేసింది. యేమి న్యాయం? నేను శాశ్వతంగా అక్కడే వుండి పొమ్మనటం లేదు పెద్దయ్యా! వెళ్లి వస్తూ వుండాలి అని చెపుతున్నా వినిపించుకో లేదు. పెద్ద పెద్ద విషయాలు విడమర్చి చెబ్బమంటే బాగ చేతా. చిన్న విషయం తెలియదు. మితిమీరిన పట్టుదల. ఇహహీ అని సీతని వేలితో చూపాడు. నా గోడు విను పెద్దయ్యా, ఒళ్ళొంచి పని చేస్తె రావులికి ముద్దొచ్చి ముద్దులు పెట్టాడా? అలాగే తక్కి నవాళ్ళకి ముద్దువస్తా. మరినాకు కట్టబాటేది. ఆనాడు నాపెళ్ళి ఖర్చు యవరినెత్తిన పడుతుందోనని అందరూ మొహాలు తప్పిం చారు ఈనాడు యీమాటెవర్ని వరించుచోనని మొహం వంకే చూస్తారు. దానికి ఆనువు కల్పిస్తున్నాడు రావులు. నాకు న్యా యం కావాలి తీర్పు కావాలి పెద్దయ్య లేచాడు, ఆందరూ లేచారు ఇంకా తీర్పు కోరిన వారున్నారు

"సాయంకాలం కలుసుకొందాం, యెండ నెత్తికెక్కింది' అని దూరానికి చూస్తె ఒక అడమనిషి వస్తూ కనిపించింది, అం దరూ వెళ్లి పోయినారు. సీతమ్మ నెత్తిన చీరకొంగు వేసుకొని

వెళ్లిపోయింది రావులు నవ్వుకొంటూ సీతమ్మ వెనకాలె నడిచాడు పెద్దయ్య అదీ గమనించాడు. నవ్వుకునాడు. ఆ స్త్రీ దగ్గరకి వచ్చింది.

"నువ్వా జోగులమ్మా! నీకూ తీర్పు కావాలా? 'ఆకలి వేళా అన్యాయంగా మాట్లాడతానేమో సాయంకాలం రారాదూ?

'అందరెదుటా చెప్పుకోదగ్గవి కావివి పెద్దయ్యా. ఈ పాటి కందరూ వెళ్ళి వుంటారని వూహిస్తునే వచ్చాను."

'అసలెందుకలా జరిగిందీ. దాన్ని మళ్ళా మార్చాలని చూస్తున్నారు? అప్పుడు తీర్పురాదు.'

"నాకూ న్యాయం కావాలి" అన్నది జోగులమ్మ.

'అందరికీ కావాలి న్యాయం. దానిదేమున్నది? నీకూ మొదటే న్యాయం తెలిసి వుండాలి యేమంటావు. రావులు వెళ్ళి వస్తున్నాడని తెలిసిననాడే ముడి పెట్టించి యింటికి తెచ్చుకో వాల్సింది, ఇంత దూరం వెళ్ళేదిగాదు కథ. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నావు.' సానుభూతి చూపాడు పెద్దయ్య.

"యేం చేయమంటా పెద్దయ్యా? న్యాయం చూడు. అప్ప టికే యింటి యజమాని రెండు పెళ్ళిళ్ళూ ఆర్భాటంగా చేశాడు. ఇద్దరు వియ్యాలవారు ఆస్తిపరులే. కాని అప్పులపాలైంది మేమే అన్నీ అమ్ముకున్నదీ మేమే. అన్ని మర్యాదలు చెల్లిస్తూ మా పిల్లల చదువులు రోగాలు రొప్పులూ చూసుకొంటూ కొత్త కోడ లినీ, కొత్త అల్లుడినీ గూడా ఆదుకొన్నాము. ఇంటిమీదబడి తిన టం తప్పితే వో వేడుకా, ముచ్చటా యేమీలేవు, యే వేడుకలు

చేసినా షేమె చెయ్యాలి. తీరా చూస్తే రాష్ట్రలు గూడా అదే గాడ్డిన బండి తీసికెలుతున్నట్టు అర్ధమైంది. సీతకి అపాటి అంగ బలం, అర్ధబలం గూడా లేవు. అన్నీ నేనే చేయాల్సి వస్తున్నది అని భయపడి పోయాను.' అన్నది విచారంగా.

అంతవరకు న్యాయంగానే వున్నది. మరి సీత ఒంటరిదై పోయిందని తెలిసిన నాడైనా ఒకే వూళ్ళో వుండిగూడా సీతమ్మనూ, బిడ్డలను తెచ్చుకోలేదు, దానికేమి సమాధానమిస్తావు?

యెట్లా? సంఘ విరుద్దంగా కట్టుబాటు లేకుండా వున్నదాన్నెలా తెచ్చుకోవటం? నలుగురూ నవ్వరూ? తెలివిగా మాట్లాడుతున్నట్టు చూసింది జోగులమ్మ తల తాటించి మూతి విరిచింది

'యిప్పుడందులో మార్పు లేదుగా. పరిస్థితి అలాగే వుంది మనలో మాట జోగులమ్మా! యేమి ఆశిస్తునావు సీతమ్మనుండి. అని పెద్దయ్య తమాషాగా నవ్వుతూ చూశాడు.

నా కొడుకు తెలివి తక్కువవాడు. దాని మెడలు వంచడం చాతకావటం లేదు వాడికి. అని తలవంచుకు ఆలోచిస్తు, "దారి కొస్తునాడు పెద్దయ్య. నా పక్షమే తీర్పు చెప్పే అవకాశముంది. చిన్ననాడు ఒక బళ్ళో చదివాము. అని తలపోసంది జోగులమ్మ శిధిలమవుతున్న రాజ్యాన్ని దిద్దుకొచ్చి నిలబెట్టాలి పెద్దయ్యా! యెవరూ నన్ను ఖాతరు చేయుటం లేదు. నా కొడుకంటే దానికి భక్తి వున్నాది. వాడి ద్వారా దాన్ని రప్పించి అని నవ్వింది. రాజకీయవేత్తలాగా చూసింది.

ఓహో! దాన్ని గుప్పిట్లోవుంచుకుని నూర్జహాన్‌బేగం లాగా చివరివరకు నీవే అధికారం చెలాయిస్తు పేరుకు మంచి హోదా యిచ్చినట్టు సీతమ్మకు భ్రమ కల్పించి, దాన్ని బాగా వాడుకోవాలని ఆలోచిస్తున్నావు. అంతేనా! నీ యింటికి రప్పిస్తే నీకు స్థానబలిమి వుంటుంది. తేలిగ్గా గెలుస్తావు. కాని న్యాయం న్యాయమే జోగులమ్మా. నీ మెప్పు కోసం నీ భర్త, ఆయన్ని మెప్పించాలని నువ్వూ ప్రయత్నిస్తూ పరాయి బిడ్డ జీవితంతో చెలగాటమాడారు. సత్యమంతే. రావులు మీ పక్షమే. సీతమ్మను లొంగదీసుకోవడమే చాతకావటం లేదు. అదే నువ్వూ కోరేది. మతమంటే, ఆచారమంటే యేమిటో నీకు తెలుసునా? నిర్దోషుః ను లొంగదీసి హింసించడమేనా మతం చెప్పుచున్నదీ? రేపు నువ్వూ మీ ఆయన గూడా అందరితోపాటు రండి. తీర్పు యిస్తా.

జోగులమ్మ తలొంచుకొని వెళ్లిపోయింది.

పెద్దయ్య "యెంత అహం? తానే అన్నీ చేయగలను, చేశాను అనుకుంటున్నది. భగవంతుని మరిచింది. దయా గుణమే దైవమని తెలుసుకోదు. అందరూ తన గుప్పిట్లో వుండాలి. చింత చచ్చినా పులుపు చావలేదుట." అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

## 2

వారం రోజులాయె పెద్దయ్య రావటం లేదు రచ్చబండ మీదకి. పొరుగూరి పెద్దమనుషులు పిలుచుకెల్తున్నారని తెలిసింది. పెద్దయ్యతో వచ్చి రచ్చబండ మీద కూచునే వారికి తీరుపు

చెప్పటం చేత కాలేదు. చివరికెలాగైతేనేం అటకాయించి, పట్టి, తెచ్చేశారు. ఓ పక్షం గడిచిందీ, పెద్దయ్యకి కామెర్లని తేలిందీ. డాక్టరు వస్తూనే వున్నాడు- కఠిన పచ్చం చేయించుచున్నాడు. నారింజ, బత్తాయి, కమలా వండ్ల రసాలు, మజ్జిగ అన్నం, ఊరకబెట్టిన కూరలు అదీ తిండి, పెద్దయ్య నెల తిరిగేప్పటికి బాగా తీసేశాడు. అయినా వూరివాళ్లు తోడుపట్టుకొని, చక్రాల బండి అందితే దాంట్లో కూచోబెట్టి, రచ్చబండకి తెస్తున్నారు.

"ఇదీ బాగుంది. పొద్దుబోతున్నది. పడుకునీ పడుకునీ వెన్ను నెప్పి, నడుం నెప్పి వస్తున్నాది" అనుకున్నాడు పెద్దయ్య. మెత్తని దిండ్లు వేసిన కుర్చీలో కూచున్నాడు పెద్దయ్య. పొద్దున తొమ్మిదైంది. చాకలి రామిగాడు తాటాకు విసనకర్రతో విసురుతున్నాడు. రెండుపక్కలా స్నేహితులూ.

రామదాసువచ్చి పెద్దయ్యకు మొరుగులిచ్చి దణ్ణం పెట్టాడు.

"యేం రామదాసూ? ఇచ్చేశావేం? నీ సొమ్ము నీకు చేరిందా?"

"నీ మీద గురి వుంచాక చేడదా పెద్దయ్యా! వియ్యపురాలే సొయంగా వచ్చి యిచ్చేసింది. పట్నమెళ్లిందంట. సరుకులమ్మ జూపితే, యిది దొంగసొమ్ము లాగా కనబడు తున్నది. నాలుగోవంతు ధర యిస్తాము. మరీ పాత సొమ్ము. టంకం యెక్కువగా వున్నది అన్నారుట. పెమాదమై హాస్ప టల్లో చేరితే, పుట్టిన బిడ్డా వూపిరాడక రెండో రోజే పోయాడట. నడుముకి తాకిన దెబ్బ తగ్గుతుండగానే పంపేసినారట. బయ

వడి పోయిందది వియ్యపురాలు. ఇంకోటీ పెద్దయ్యా! మా బం
ధుగులమ్మాయిని మా వోడికిస్తామని వచ్చారు. నిబద్ధి చేసే
రోజున నిన్ను తీసికెళ్ళి నిబద్ధి జేస్తా."

రామదాసు వెళ్ళిపోయే వేపే చూస్తూ పెద్దయ్య నవ్వ
మొహం పెట్టాడు. మరో రెండు తీర్పులు గెలిచాయి. అంతా
సంతోషించారు. చారుమతి నిలబడింది.

"నాకూ న్యాయం కావాలి పెద్దయ్యా!" అని తల వంచు
కున్నది.

"యే విషయంలో కావాలీ. వివరాలు వినద్దూ చారు
మతమ్మా!"

"చెప్తా. నింపాదిగా చెప్పాలి. ఆ మద్దెన మా బాబు
పోయాడు. మాయమ్మ యేనాడో యెల్లిపోయింది. వినే వుం
టావు. నాకు పెళ్ళినాడిచ్చిన పొలంగాక, అమ్మా నాయనా
ఆస్తి గూడా నాకే చెందింది. అదంతా దూరాన వున్నదని
మా ఆయన అమ్మజూపాడు. మంచి ధరే పలికింది పెద్దయ్యా.
అంతొస్తుందని నేననుకోలేదు." అని ఆగింది.

"బాగానే వుందే యేమిటిబ్బంది?"

"సెప్తన్నా. ఆ డబ్బుపెట్టి మేమున్న లోగిలి కొనేసి
నాపేర పెట్టాడు నా పెనిమిటి. ఇంటాయన కొత్తగా కట్టించు
కున్న యింట్లోకెళ్ళాడు.

"అదీ సమంజసంగానే వున్నది." ప్రశ్నార్థకంగా
చూశాడు పెద్దయ్య.

"పేరుకి యిల్లు నాదే గానీ పిసరంతైనా అధికారం లేకుండా చేశాడు నా పెనిమిటి. అదేం న్యాయం అని నిలేస్తే 'నేను నీకు మంచి చేశాను. న్యాయంగానే చేశాను. నీ ఆస్తి సమానంగా నీ కన్నబిడ్డలకే దక్కుతుంది. మరెవరూ భాగం పెట్టమని రాలేరు. నా పేర వుంటే, సమిష్టి ఆస్తి అని భాగం కోసం కోర్టుకెక్కుతారు. ఇప్పుడటువంటి అవకాశం లేదు' అని నవ్వుతాడు. తాను ధర్మమూర్తినీ, తెలివిగలవాడినీ అంటాడు. యేమో నాకూ దోచటం లేదు పెద్దయ్యా! చూస్తే అన్యాయాన్ని యెదుర్కోవాలా అని అనిపిస్తున్నది."

"యెందుకనలా అనిపిస్తున్నది?"

"విను మరి నా వంతు భాగమేమిటంటే వంటిల్లూ పడగ్గదీ. ఆ రెండుచోట్లే నేను పనికివస్తున్నా. తక్కినదంతా వచ్చే పోయేవారికీ, మగడూ పిల్లలకీ, పనివాళ్ళకీ పనికి వస్తున్నాది. యెక్కడికీ పోనీయరు. 'ఇంట్లో వుండదెప్పుడూ' అనే చెడ్డ పేరొస్తుందిట నాకు. అత్తెసర్లు పెడుతూ, అప్పటి కప్పుడన్నీ చేసి వడ్డిస్తూ నడ్డి లేవకుండా పనిచేయాలి. యెక్కడేం పెట్టినా బాగా లేదని తీసేస్తారు. వాళ్ళే యింటిని అందంగా వుంచగలరుట. పోనీలే అని పూలమొక్కలూ, కూరపాదులూ, ఆకుమడులూ వేసి పెంచుకుంటుంటే వాటిని చంపేయనూ, కోసి తీసికెళ్ళనూ, మరొకళ్ళకి గూడా కోసి యివ్వనూ చేస్తూ వుంటారు పనివాళ్ళు. పర్మిషన్ లేనిదీ పండగా పబ్బమూ, వేడుకా యేమీ చేసుకోనీయరు. గేలిచేసి, గదమాయించి అడ్డు పడతాడు మగమహారాజు. నా కోసమెవరూ రారాదు. పిల్లల పెంపకం, చదువులూ తనిష్టమే. నేను కలగజేసుకోరాదు. 'చదువు

చాలు, పెళ్ళిళ్ళు చేయాలి' అని గుర్తు చేస్తే యెకచకాలాడి వంకలు పెట్టి, వియ్యాలవారొచ్చి మేసిపోవాలా? అ పని చేసిపెట్టు యీ పని చేసిపెట్టు అని పీక్కు తినాలా? ప్రాణం హాయిగా వున్నది. నీకు కన్నెర్రిగా వున్నదే. నీకూ అసహనం పెరిగిపోతున్నది. యేదీ సహించలేకపోతున్నావు. అలా భయపెట్టనూ, యీసడించనూ చేశాడు మగమహారాజు. తన మాటె నెగ్గాలి. పెళ్ళీడు దాటి పిల్లల్ను గనే వయస్సు దాటున్నదని గుర్తు చేస్తే, విరగబడి నవ్వి యాభై యేళ్ళకీ పుడతారని నమ్మబలికాడు మగమహారాజు. యెందుకులే పెద్దయ్యా. చెప్పటానికి సిగ్గేస్తున్నది."

"చెప్పమ్మా ఫరవాలేదు." ఊరడింపుగా అన్నాడు పెద్దయ్య.

కళ్ళు దుడుచుకుని చారుమతి చెప్పాకెళ్ళింది.

"అట్లా నవ్వులాట పట్టించి వూరుకోక, తనవేపు మగబిడ్డలకూ, ఆడకూతుళ్ళకీ సంబంధాలు స్థిరపరచి, చౌకగా పెళ్ళిచూపులూ, పెళ్ళితంతూ, సీమంతాలూ జరిపించాడు మగమహారాజు." అని చీదిందీ చారుమతి. కళ్ళు యెర్రిబడినాయి. "నేను దీవించి అక్షింతలేయాలిట. లేకపోతే నాకు అసూయ అనుకుంటారట".

"వూరుకో అమ్మా నే చెప్తాగా. నీ వుద్దేశం తెలియాలి.

'నా వుద్దేశం పెద్దయ్యా! ఆ యిల్లు నాపేర తీసేయమను అప్పుడు పరాయింట్లో వంటమనిషిని అని సరిపెట్టుకుని యిల్లు

కనిపెట్టుకుని కావిలి కాస్తు వుంటాను. పరాయి మగాడి మీద మోహం కలుగుతుందా? కలుగదు. కనక పడగ్గదిలోకి పోనక్కరలేదు. వయస్సూ మళ్ళింది. మనుమలూ, మనుమరాళ్ళతో పొద్దుపుచ్చే వయస్సునాది సరవసల్లాపాలాడుతూ తమలపాకు చిలకలందించే వయస్సుగాదు. కృష్ణా,రామా అనుకునే వీలుండాలి" అని కూచుంది.

'మరి నే చెప్పేది నీకు బాధ కలిగిస్తుందేమో, నీ మగమహారాజు రాలేదు. వచ్చి వుంటే నిలేసి వుండేవాడిని' అన్నాడు సముదాయింపుగా.

"యేం బాధకలిగించదు పెద్దయ్యా! రామదాసుకి లాభించింది చూశానుగానా. జోగులమ్మకి పక్షవాతమొచ్చి నడుం పడింది. అహం చంపుకోమని చెప్పావుట. నోరుగూడా పడకముందే ఆ పని చేయాలని చూస్తున్నది. దేవుడి మీద భారం వేయాలని చూస్తున్నది. చూసే వచ్చాను పెద్దయ్యా. అందరినీ గుప్పెట్లో వుంచుకోవాలనే కోరికను విడనాడు అని తీర్పు చెప్పావట. ఆ కోరిక చావదనుకో.

సరే చెప్తున్నా విను. ఇల్లు నీ పేరుమీద నుంచి తీసేయటం మంచిది గాదు. నీ బిడ్డల క్షేమం కోరి అదలా వుండాలి. పోతే నువ్వు నా యింటికొచ్చేయి. నా అయిదో పింతల్లికి ఆరో పడి వచ్చింది. వస్తుంది. ఆమె చేసుకోలేదు. పైగా యాత్రలు చేయాలి. పెద్దముండనైనానని గోలపెడుతున్నది. యెవరూ తోడు లేరుట. కళ్ళు బాగుండగానే వెళ్ళి వస్తానంటున్నది. ఆవిడతో వెళ్ళి రావచ్చు. ఖర్చులామెవేలే. మనస్సు రాయి చేసు

కోవాలి. లొంగావంటే నా తీర్పు వృధా అవుతుంది. యేమం టావు. పోనీ ఆలోచించుకుని రేపే వచ్చేయి. తొందర్లేదు. నీ విలువ నీకు తెలుసు. తక్కినవారికి తెలిసిరావాలి. నే చెప్పే దానివల్ల నీకు లాభించకపోతే నేను మతం మార్చుకుంటాను' అని కుర్చీకి తల ఆనించాడు పెద్దయ్య.

కొంతమంది ఆశ్చర్యపోయారు, కొంతమంది చిన్నగా నవ్వారు. కొంతమంది 'బాగుంది మాబాగా చెప్పాడు పెద్దయ్య తీర్పు అన్నారు.

మరో రెండు తీర్పులిచ్చి పెద్దయ్య లేచాడు. చారుమతి మరో యిద్దరుస్త్రీలతో కలిసి, పెద్దయ్య భవంతివేపే వెళ్లింది.

క్రమంగా పెద్దయ్య కూచోలేక పోయాడు. తనతో వచ్చే వారినే తగాయిదాలకి తీర్పు యివ్వమన్నాడు, ఇవ్వగలిగినవి పరిష్కరించి తీర్పు యిచ్చారు వాళ్లు. ఇవ్వలేనివి యింటికి తెచ్చారు.

"యింకెన్నాల్లుంటింది పసిగర్లు? అనడిగాడు మగమహా రాజు. రచ్చదండ దగ్గరికి రావటానికే అవమానంగా తోచింది. మగమహారాజుకి.

'అంత తొందరగా కావాలంటే పెద్దయ్య యింటికెళ్ళరాదు రాజు!" అన్నాడు కాపు చిన సంగయ్య.

"మరీ యేడిపించకు సంగయ్యా" అన్నాడు కోటయ్య.

'యింకా నెలా పదిహేను రోజులుంటుందని చెప్పాడు వైద్యుడు. పెద్దయ్య తొంభయ్యో పడిలో పడినాడు గందా

నయం గావటం కష్టం అంటున్నాడు. వంటమనిషి వద్దేచ్ఛగా అని నవ్వాపుకున్నాడు రెండో తీర్పరి కోటయ్య.

"ఆమె చేతికందినవన్నీ యెత్తుకు పోవటమేగాక యెక్కువ వండి మిగిలిపోయినయ్యని తీసుకు పోతున్నది. వంట వకసారే చేస్తుందిట గానీ అన్ని సార్లు వండదట. ఆ వంటగూడా అన్నీ అందిస్తె చేస్తుంది. వంట బాగాలేదు అనంగనే రాదు. పిల్లలూ, బంధువులూ తిట్టుకుంటూ తుమ్ముకుంటూ యింకా అధ్వాన్నంగ చేస్తారు చచ్చీ, చెడీ వళ్ళు హూనమై రాత్రి పొద్దుపోయాక ఆఫీసునుంచి వస్తె అన్నంవడ్డించేవారే లేరు. పెట్టుకొని తినాల్సి వస్తుంది. ఆదేం తీర్పు చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది యాత్రిలకి. అని విసుక్కున్నాడు మగమహారాజు.

మహారాజ్ ని ఆలి యాత్రలకి వెళ్లింది. చారుమతమ్మ చెపితే నువ్వు వినిపించుకునే స్థితిలోలేవన్నది. నివేపు వారు వస్తున్నారుట. యక్కడికి వెళ్ళేందుకూవీళ్ళేదు. ఇప్పుడేం యాత్రలు రామాయణంలో పిడకలవేటలాగ. అనికసిరావుట మహారాజ్

నవ్వు పైకిరానీయకండా గంభీరంగఅన్నాడు సంగయ్య

'పెద్దయ్యను చూడడానికి వెళ్ళాల్సిందేనంటారా? యెట్లా వున్నాది పలిగర్లు' కోటయ్యకేసి చూస్తూ అడిగినాడు రాజు.

'యెట్లా వున్నదా. తిన్నదల్లా ఋమడక వాంతులవుతున్నాయి పెద్దయ్యకి

"చెప్పేది వింటాడా? వెల్తాను." వేరగానిలాగా చూశాడు మహారాజ్.

కథా నిలయం
5233
శ్రీకాకుళం



"యేమో! నీవు చెప్పేది న్యాయంగా లేక వాంతులు గావచ్చు. దానికి సిద్ధపడి వెళ్ళాలి మహారాజ్!" అప్పుడు దొర అన్నాడు. వారం తిరక్కముందే రెండుసార్లు రచ్చబండ చుట్టూ తిరిగాడు మగమహారాజు. పెద్దయ్య రానేలేదు. తీర్పరులు నవ్వుతూ చూశారు.

ఇంటికెళ్ళి చెప్పుకుని మంచి తీర్పు పొందిన, పున్నమ్మ తాజాపండ్లు నారింజ బత్తాయి బుట్టెడు తెచ్చి రచ్చబండ దగ్గర పెట్టి అన్నది.

"దణ్ణాలు పెద్దయ్యకి, అయనిచ్చిన తీర్పుమీద నిలబడి, నా కొడుకులు, ఒకడు నెలకు భృతి యిచ్చి పోతున్నాడు, రెండవ కొడుకు నెలకు సరిపడా కిరాణా తెచ్చి యింట్లో సద్ది పోతున్నాడు, మూడవవాడు పాలూ, పెరుగు తెచ్చి యిస్తున్నాడు. కూతురు యిల్లు చిమ్మి, గిన్నెలు కడిగిపెట్టి పోతున్నది. తగాదాలు సమసిపోయాయి. ఇవి మీ నలుగురికీనూ." అని వూరగాయల సీసాలిచ్చింది.

అప్పారావూ రచ్చబండకాడికే వచ్చాడు.

"దణ్ణాలు ధర్మప్రభువు పెద్దయ్యకి. నా కూతురు పెళ్ళికి నా భార్య వప్పుకున్నది. పెద్దయ్య తానే నాకు వేరే అమ్మాయిని కుదిర్చానని చెప్పి పెళ్ళి చేయగానే వచ్చేస్తుందంటే భయపడిపోయింది. ఇపుడు తరుచూ, యిల్లూ పిల్లల్నీ వదిలి పుట్టింటికెళ్టం లేదు. మా అమ్మ ప్రాణం తెరిపినబడింది. నా తమ్ముడు నా పాన్‌షాపు చూస్తున్నాడు. రాత్రి బడికి వెళ్తున్నాడు. వాచ్‌మన్ కొడుకు అప్పలనరసింహం వుద్యోగంలో

చేరాడు. కట్నం తీసుకోనన్నాడు. నేను లిక్కరు వ్యాపారం మానేసి పాల వ్యాపారం చేస్తున్నాను. ఉద్యోగంలోకి రెగ్యులర్‌గా వెళుతున్నా. ఈ ధోవతుల చాపు పెద్దయ్యకి, ఈ తువాళ్ళు నాలుగూ మీకు" అని వెళ్ళిపోయాడు.

సుబ్బరామయ్య పెద్దయ్యను చూడటానికి వాళ్ళింటికే వెళ్ళాడు. ఆయన ఆయుర్వేద వైద్యుడు.

"ఇనాళ్ళెట్లా వున్నది పెద్దయ్యా! నేను నీకోసం ప్రేయరు గూడా చేశాను. వ్యాధి ముగియవచ్చింది. రేపటితో మూడు నెలలు అవుతుంది వ్యాధి సోకి."

"కూచోండి. నించునే వున్నారెందుకు. వయస్సులో చిన్నైనా బుద్ధిలో పెద్దే. వ్యాధి తిరుగుముఖం పట్టింది. రోజూ వచ్చి చూసిపోతూ శ్రమ తీసుకున్నారు. లేచి తిరగ్గలుగుతున్నా. రచ్చబండ వేపు వెళ్ళకపోతే తోచటం లేదు. మీ రుణం యెలా తీర్చుకుంటానో." పెద్దయ్య లేచి కూచున్నాడు.

వైద్యుడు నాడి చూసి, నాలుక కళ్ళూ చూశాడు.

"తగ్గిపోయింది పెద్దయ్యా! జయించావు. నాకే భయంగా వుండేది పెద్దయ్య వచ్చి కూచుని తీర్పునివ్వకపోతే రచ్చబండ చిన్నబోదా? యేమవుతుందో అని బెంగపడ్డాను.

"మీదంతా హాస్యం. అంతా ఆ భగవంతుని దయ."

"కావచ్చు. నా రుణమా! మా నాన్న కోడల్ని తేవటానికి ఒప్పుకున్నాడు. నా భార్యా కొడుకునూ యింటికి తెచ్చు

కుంటానిహ. అదంతా నీ తీర్పు చలవ పెద్దయ్యా. నా వ్యథ తీసేశావు ఇంకేమివ్వాలి. చిన్నపిల్ల తనవాళ్ళకూ దూరమై ఒక్కతే వేరే వూళ్ళో యేడవాల్సి వచ్చింది. కొంచెం కట్నం కోసం యింతమంది వ్యథలపాలు గావాలా అనిపించేది. కట్నం యివ్వక యెగేశాడని కోడల్ని తేవద్దు అన్నాడు మా నాన్న.

"మజ్జిగ తీసుకోండి. వుప్పుగల్లు వేయమన్నారా?"

"ఆఁ అక్కర్లా." గ్లాసు అందుకున్నాడు వైద్యుడు సుబ్బ రామయ్య.

"మీ పక్కింటాయన బావున్నారా?"

"అదే బాగు. పైకి బింకంగా వున్నాడు గానీ పెద్దయ్యా, చారుమతమ్మ కోసం వేయికళ్ళతో యెదురు చూస్తున్నాడు. చిక్కి సగమైనాడు." మీ యింటికి రావాలనే అనుకున్నాడు గానీ మొహం చెల్లక రాలేదేమో!

వారం అయాక పెద్దయ్య రచ్చబండవద్ద కనిపించాడు. పొద్దున తొమ్మిది గంటలైంది. తగాయిదాలు వింటు న్నాడు పెద్దయ్య.

మగమహారాజ్ వచ్చి నిలబడ్డాడు.

"రండి మహారాజ్! కూచోండి. యేమిటి విశేషం. నావల్ల యేం కావాలి." అని లేచి నిలబడ్డాడు పెద్దయ్య.

"కూచో పెద్దయ్యా! చాలా తీసేశావే. పాకిస్తాన్ కావాలని పట్టుబట్టి విడిబడ్డాక కాయిదే అజాకుకి తాను చేసిన పని బాగా లేదని తెలిపి వచ్చిందట. నేను వెళ్ళి పండితునితో మాట్లాడు తాను. కలిసి వుందాము అన్నాడట. దానిక్కారణం ఆయ న్నెవరూ ఖాతరు చేయకపోవటమే. అలా వున్నది నా పరిస్థితి: నా భార్య యెక్కడున్నాదో చెపితే వెళ్ళి తెచ్చుకుంటా, అధి కారం వదులుకున్నట్టె." అని మొహం తుడుచుకున్నాడు.

"అమ్మగారివాళ పొద్దున ఆరుగంటలకొచ్చారు. మా పింతల్లీ వచ్చింది. కబురంపుతాను. వస్తారు. తీసికెళ్దురుగాని." అని నవ్వాడు పెద్దయ్య.

మరో గంటకి చారుమతీ మగ మహారాజు కలిసి వెళ్తుంటే పెద్దయ్యా పింతల్లీ తక్కినవాళ్ళూ సంతోషించారు.

— ० —